ప్రజల చెంతన.. వంతెన



వర్షా కాలం వస్తే రాకపోకలు బంద్.. ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లాలంటే దూరాభారం.. పైగా అష్టకష్టాలు పడి చేరుకోవాల్సిందే.. కొన్ని గ్రామాల్లో అటువంటి అవకాశం లేక గెడ్డల్లో సాహసించి దిగితే కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. ఈ విషయమై ఎంతోమంది ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వంతెనలు నిర్మించాలని కోరినా ప్రయోజనం లేకపోయింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఐదు చోట్ల వంతెనలు నిర్మించి వారి కష్టాలకు మోక్షం కలిగించింది.

- కె.కోటపాడు మండలంలో ఐదు కల్వర్టుల పూర్తి
- గతంలో చుట్టూ తిరిగిరావాల్సిన దుస్థితి
- ఇప్పుడు గెడ్డలపై సాఫీగా ప్రయాణం
- ఆనందంలో ప్రజలు

కె.కోటపాడు మండలం
మొత్తం కొత్త వంతెనలు : **5**
వీటి నిర్మాణానికి మంజూరైన నిధులు : రూ.**1.44** కోట్లు



కొరువాడ - గవరపాలెం మధ్య కందిగడ్డపై వంతెన



గొండుపాలెం-మురుగుపాలెం వద్ద మొండి గెడ్డపై నిర్మించిన వంతెన



సూర్రెడ్డిపాలెం - మేడిచర్ల గ్రామాల మధ్య మొండిగెడ్డపై నిర్మించిన వంతెన

కె.కోటపాడు: మండలంలో ఐదు చోట్ల వంతెనలు నిర్మించడంతో ఇటీవల తుఫాన్ వర్షాలకు ప్రజలు రాకపోకలు సాఫీగా సాగాయి. గతంలో మాదిరిగా ఎటువంటి ప్రాణనష్టం ఇక ఉండబోదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- సూర్రెడ్డిపాలెం నుంచి మేడిచర్ల మార్గంలో మొండిగెడ్డపై రూ.30 లక్షలతో వంతెన నిర్మించారు. దీంతో సూర్రెడ్డిపాలెం, మేడిచర్ల, రొంగలినాయుడుపాలెం, పైడంపేట, గొర్రుపోటువానిపాలెం గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తొలగాయి. గతంలో సూర్రెడ్డిపాలెం చెరుకు కాటాకు ఈ గెడ్డ మార్గంలో ఎడ్లబళ్లపై చెరుకును తరలించేందుకు ఆపసోపాలు పడేవారు. ప్రస్తుతం వంతెన నిర్మాణంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- కొరువాడ - గవరపాలెం గ్రామాల మధ్య కందిగెడ్డపై రూ.13.23 లక్షలతో వంతెన నిర్మించారు. గవరపాలెం, భూమిరెడ్డిపాలెం, లెక్కల పైడమ్మపాలెం, కొరువాడ గ్రామాల ప్రజలకు మేలు కలిగింది. ఈ గెడ్డ నీరు ఉధృతంగా ప్రవహించే సమయాల్లో కొరువాడ హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఆ కష్టాలు తొలగాయి.
- గొండుపాలెం- మురుగుపాలెం గ్రామాల మధ్య తారురోడ్డుతోపాటు రెండు చోట్ల మొండి గెడ్డపై రూ.49 లక్షలతో వంతెనలు నిర్మించారు. పైడంపేట, మురుగుపాలెం, పాచిలవానిపాలెం, గొండుపాలెం గ్రామాల ప్రజల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. గతంలో మొండిగెడ్డలో నీటి ఉధృతికి పశువులు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పుడు ప్రాణనష్టం తప్పింది.



కొరువాడ జగన్నాథపురంలో సాయిపురాయుడు గెడ్డపై వంతెన



వంతెన నిర్మించక ముందు సాయిపురాయుడు గెడ్డ

- కొరువాడ జగన్నాథపురం - దాలివలస రైవాడ కెనాల్ మార్గం వరకు తారురోడ్డుతో పాటు సాయిపురాయుడు గెడ్డపై రూ.27.65 లక్షలతో వంతెన నిర్మించారు. గతంలో గెడ్డపై వంతెన లేకపోవడంతో వర్షాకాల సమయాల్లో రాకపోకలు నిలిచిన సందర్భాలు ఉన్నాయి. వంతెన నిర్మాణంతో కొరువాడ జగన్నాథపురం, ఆర్.వై.అగ్రహారం, గవరపాలెం, దాలివలస గ్రామాల ప్రజలకు మేలు కలిగింది.

ఇబ్బందులు తొలగాయి



తుపాన్లు వచ్చాయంటే మొండిగెడ్డపై రాకపోకలు నిలిచిపోయేవి. పశువులు పలుమార్లు గెడ్డలో కొట్టుకుపోయిన పరిస్థితులను చూసాం. ప్రస్తుతం గొండుపాలెం-మురుగుపాలెం మార్గంలో మొండి గెడ్డపై రెండు చోట్ల వంతెనల నిర్మించడంతో రెండు గ్రామాల ప్రజల బెంగ తీరింది. ఇటీవల మిచాంగ్ తుఫాన్ వచ్చినా సాఫీగా రాకపోకలు సాగాయి.
– వంటాకు శ్రీను, గొండుపాలెం

వంతెనల నిర్మాణం ఊహించలేదు



సాయిపురాయుడు గెడ్డపై వంతెన, రోడ్డు నిర్మించాలని గతంలో ఎంతోమంది ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించాం. కాని పరిష్కారం కాలేదు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఈ సమస్యను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వంతెన నిర్మించడంతో మా కష్టాలు తొలగాయి.
– చీపురపల్లి గోవింద, కొరువాడ జగన్నాథపురం

క్లుప్తంగా

త్వరలో సామాజిక తనిఖీలు

రోలుగుంట: మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనులపై త్వరలో సామాజిక తనిఖీలు ప్రారంభం కానున్నాయి. దీనికి వేతనదారులు సహకరించాలని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో 16 విడత సామాజిక తనిఖీ నిర్వహణపై డివిజన్ రిసోర్స్ పర్సన్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో 952 ఉపాధి పనుల నిర్వహణకు ప్రభుత్వం రూ.12.69 కోట్లు ఖర్చు చేసిందన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి దీనిపై వాస్తవాలు నిగ్గుతేల్చాల్సింది. ఈ మేరకు స్టేట్ రిసోర్స్ పర్సన్ రామారావు అవగాహన కల్పించారు. సీఆర్పీలు, ఏఈలు ప్రేమానందం, ఉమామహేశ్వరుడు, రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

119 మందికి వైద్య పరీక్షలు

కె.కోటపాడు: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా గొండుపాలెంలో సోమవారం వైద్యాధికారి భారతి 118 మందిని పరీక్షించారు. ఉచితంగా మందులు ఇచ్చారు. వైద్యం పొందే పరిస్థితి లేని ఎనిమిది మందిని ప్రత్యేక వైద్యం అందించారు. హెచ్‌వీ అచ్చియ్యమ్మ, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఎంఎల్‌హెచ్‌పీ శశికళ, ఏఎన్‌ఎం కుమారి పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతలకు సర్టిఫికెట్లను అందిస్తున్న వైశ్యరాజు కృష్ణరాజు

కె.కోటపాడు: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య నేర్చుకోవాలని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు వైశ్యరాజు కృష్ణరాజు అన్నారు. సత్యసాయిబాబా జన్మదినాన్ని పురస్కరించుకొని సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం ఆయన బహుమతులు ప్రదానం చేశారు. 12 పాఠశాలల నుంచి 84 మందికి సర్టిఫికెట్లను అందించినట్లు సత్యసాయి సేవాదళ్ జిల్లా కోఆర్డినేటర్ కసిరెడ్డి అప్పలనాయుడు తెలిపారు. భజన మండలి కె.కోటపాడు సమితి కన్వీనర్ నారాయణపాత్రుడు, హెచ్‌ఎం పద్మావతి, మురళీ పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ ఆరాధన మహోత్సవం



ఆనందపురంలో ప్రసంగిస్తున్న జాషువా

కె.కోటపాడు: లోక రక్షకుడైన యేసుప్రభు దీవెనలు ప్రజలందరిపైనా ఉండాలని విశాఖపట్నానికి చెందిన రెవరెండ్ వై.ఎస్.జాషువా ఆకాంక్షించారు. పాస్టర్ ప్రేమ సముద్రం ఆధ్వర్యంలో ఆనందపురం ప్రార్థనా మందిరంలో సోమవారం రాత్రి కిస్మస్ ఆరాధన మహోత్సవం నిర్వహించారు. కె.కోటపాడు, దేవరాపల్లి, వేపాడ మండలాల నుంచి క్రైస్తవులు హాజరయ్యారు. వీరినుద్దేశించి రెవరెండ్ జాషువా ప్రసంగించారు. ప్రతి కుటుంబంలో క్రిస్మస్‌కాంతులు ఉండాలని అభిలషించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. సర్పంచ్ వంటాకు అప్పాజి, పాల్ ప్రవీణ్, డాక్టర్ ఎం.శ్రీనివాసులు, పాస్టర్ హోసన్నా పాల్గొన్నారు.

గ్రామీణ వ్యవసాయ అధ్యయనానికి శిక్షణ



నైరా కళాశాల విద్యార్థినులు ఏర్పాటు చేసిన సామాజిక పటం

చీడికాడ: శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థినులు సోమవారం అప్పలరాజుపురంలో గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వారికి శిక్షణ, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు గ్రామ వివరాలు సేకరించి, సామాజిక పటం చిత్రాన్ని వేశారు. రంగురంగులతో తీర్చిదిద్దిన ఈ పటం ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్థినులు గీత, ప్రసన్న, రాణి, శారద, విహారిక పాల్గొన్నారు.

ఓటీఎస్ హక్కు పత్రాల పంపిణీ



హక్కు పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: జగనన్న సంపూర్ణ గృహ హక్కు పత్రాల ద్వారా పేదలందరికీ ప్రభుత్వం సర్వ హక్కులు కల్పించిందని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అన్నారు. మున్సిపాలిటీ 12వ వార్డులో లబ్ధిదారులకు చైర్‌పర్సన్ సోమవారం ఓటీఎస్ పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పేదల కల నెరవేరిందన్నారు. ఓటీఎస్ స్కీమ్‌తో 1983 నుంచి 2011 మధ్య ప్రభుత్వ నుంచి రుణం తీసుకుని ఇళ్లు నిర్మించిన 120 మందికి పట్టాలు అందజేశామన్నారు. వీఆర్వో రాజులనాయుడు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

శానిటరీ పరికరాలు..
సచివాలయాల శానిటేషన్ పర్యవేక్షలకు చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి శానిటరీ పరికరాలను పంపిణీ చేశారు. ఇళ్ల నుంచి చెత్త సేకరించడానికి వీలుగా డస్ట్‌బిన్లు, ఇతర సామగ్రిని అందజేశారు. మున్సిపాలిటీలోని 28 వార్డుల్లో శానిటేషన్ పనులు పక్కాగా చేయాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, కమిషనర్ పూడి రవిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ రూ.25 లక్షలకు పెంపుపై హర్షం



సీఎం వీడియో కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రసాదుపాత్రుడు

నాతవరం: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రూ.25 లక్షల పెంపుతో పేదల పాలిట పెన్నిధిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్సులో వీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం పొందవచ్చన్నారు. దేశంలో ఏ రాజకీయ నాయకుడు చేయలేని సాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకున్నారన్నారు. ఎంపీడీవో హనుమంతరావు, తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు, నాతవరం, గునుపూడి పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: వైఎస్సార్ ఆరోగ్యశ్రీని రూ.25 లక్షలకు ప్రభుత్వం పెంపుదల చేసిందని వైద్యాధికారి ఎల్. శివప్రసాదుపాత్రుడు అన్నారు. సోమవారం కె.జె.పురం పీహెచ్‌సీ ఆవరణలో ఏఎన్‌ఎంలు, ఎం.ఎల్.హెచ్‌పీలు, వైద్య సిబ్బందితో ఆయన సమీక్షించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్యశ్రీపై మరింత అవగాహన కల్పించాలని సూచించారు. స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. జనవరి 1వ తేదీ నుంచి వారానికి ఒక సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ –2 శిబిరాలు నిర్వహిస్తామన్నారు. వైద్యాధికారి కె. లీలాప్రసాదు, కమ్యూనిటీ హెల్త్ అధికారి సిహెచ్. పుష్పమ్మ, పీహెచ్‌ఎన్ ఎం. ఇందిర పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి



స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు



కె.జె.పురం వద్ద హోమంలో పాల్గొన్న భక్తులు

నర్సీపట్నం: స్థానిక వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యం స్వామి దేవాలయంలో స్వామివారి షష్ఠి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. స్వామి వారి కళ్యాణాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు శేఖర్‌స్వామి జరిపించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మాడుగుల రూరల్: సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి సందర్భంగా కేజేపురం జంక్షన్‌లో కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి భక్తులు పంచామృతాభిషేకాలు సోమవారం నిర్వహించారు. ఆలయ కమిటీ వ్యవస్థాపకుడు రాపేట రామకొండలరావు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఎం. కోడూరు శివాలయంలో వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. మాడుగుల పార్థసారథి ఆలయంలో స్వామివారికి డి. వెంకటరమణారెడ్డి, సత్యవతి దంపతులు అభిషేకాలు నిర్వహించారు.

దేవరాపల్లి: తిమిరాం ఉమా మహేశ్వరి స్వామి ఆలయ ఆవరణలో సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పురోహితులు పాకల కామేశ్వరరావు ఆధ్వర్యంలో పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

రావికమతం: కొత్తకోటలో సోమవారం సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంతో ప్రతిష్ఠ కలిగిన ఈ ఆలయానికి స్థానికులతోపాటు వివిధ గ్రామాల భక్తులతో ఆలయం కిటకిటలాడింది. రాత్రికి భారీ అన్నసమారాధనలో భక్తులు పాల్గొన్నారు.

ఖండివరం పశువైద్యశాల ఆకస్మిక తనిఖీ

చీడికాడ: ఖండివరం పశువైద్యశాలను మాడుగుల ఏరియా పశు వైద్యశాఖ ఏడీ డాక్టర్ వి.చిట్టినాయుడు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రికార్డులు పరిశీలించారు. పశువైద్యశాల పరిధిలో వారానికి ఒక గ్రామంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించాలని పశువైద్యాధికారి గణేష్‌ను ఆదేశించారు. ఆర్బీకేల్లో పశువైద్య సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ పథకం కింద పాడి రైతులకు 35 శాతం సబ్సిడీపై రూ.2 లక్షల వరకు, నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ కింద 50 శాతం సబ్సిడీపై రూ.20 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఇచ్చే రుణాలపై దరఖాస్తు చేసుకునేలా చైతన్యవంతం చేయాలన్నారు.

రూ. కోటితో సీసీరోడ్ల నిర్మాణం




భూమి పూజ చేస్తున్న ఎంపీపీ రాజేశ్వరి

దేవరాపల్లి: స్థానిక చిన్నంనాయుడు నగర్ కాలనీలో సీసీరోడ్ల నిర్మాణానికి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి సోమవారం భూమిపూజ చేశారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంజూరు చేసిన కోటి రూపాయలతో కొన్ని రోడ్లు ఇప్పటికే పూర్తి చేయగా, తాజాగా చిన్నంనాయుడు నగర్ కాలనీలో పలు సీసీరోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వి. సింహాచలంనాయుడు, గొర్లె సన్యాసినాయుడు, వాలేటి నాగరాజు, గుండు రాంబాబు, దీవి శంకరరావు, సోమిరెడ్డి పేరునాయుడు, వరదపురెడ్డి చంద్రరావు, పంచాయతీ సెక్రటరీ ఎస్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలసిన నూతన ఏఎంసీ చైర్మన్

మాడుగుల:ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడిని సోమవారం తారువ క్యాంపు కార్యాలయంలో దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ అందుబాటులోకి రావడంతో రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు వస్తాయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం రాము పాల్గొన్నారు.

21న మెగా రక్తదాన శిబిరం



మాకవరపాలెంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, ఇతర నేతలు

మాకవరపాలెం: సీఎం జగన్ జన్మదినం సందర్భంగా ఈ నెల 21న పెదబొడ్డేపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ కోరారు. దీనికి సంబంధించిన పోస్టర్లను సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద పార్టీ అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు. నాయకులు పెట్ల భద్రాచలం, మూకల బాలకృష్ణ, గొంతిన హరిబాబు, చిటికెల రమణ, నాగేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను పాల్గొన్నారు.

గొలుగొండ: మెగా రక్తదాన శిబిరానికి సంబంధించి పోస్టర్లను గొలుగొండలో పార్టీ నాయకులు విడుదల చేశారు. నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత, యూత్ అధ్యక్షుడు రామకృష్ణనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు పాణీశాంతారామ్, సర్పంచ్ బుజ్జి పాల్గొన్నారు.

టీడీపీ మాయ మాటలు నమ్మకండి



పెదమదీనలో అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరించిన నాయకులు



పొంగలిపాకలో ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న రాజారామ్, కొండలరావు

బుచ్చెయ్యపేట: ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ పాలనను చూసి జీర్ణించుకోలేక టీడీపీ నాయకులు మాయమాటలతో ఇళ్లకు వస్తున్నారని, ప్రజలు వారికి తగిన బుద్ధి చెప్పాలని రాష్ట్ర కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి కె. అచ్చింనాయుడు కోరారు. సోమవారం పెదమదీనలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్టికను ఆయన ఆవిష్కరించారు. గతంలో రైతులకు ఉచిత విద్యుత్, రైతు, డ్వాక్రా రుణాలు మాఫీ చేయకుండా మోసం చేసిన టీడీపీ నాయకులు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని విమర్శించారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగా కొండబాబు, సర్పంచ్ కె. వెంకటరమణ, న్యాయవాది చొప్పా బాబూరావు, ఒడ్డి అప్పలనాయుడు, బోగా సత్తిబాబు, సలాది అప్పారావు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: సంక్షేమ, అభివృద్ధి పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. వై ఏపీ నీడ్స్ జగనన్నలో భాగంగా సోమవారం రాత్రి పొంగలిపాక సచివాలయం వద్ద ఫ్లెక్సీని ఆయన ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావుతో కలిసి ఆవిష్కరించారు. సర్పంచ్ నాయిన దేముడమ్మ, ఉప సర్పంచ్ భాస్కరరావు, మాజీ సర్పంచ్ నాయిన సత్యనారాయణ, నాయకులు నాయిన ధనా, తంటపురెడ్డి బన్నీ, పంచాయతీ కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

120 అంగన్‌వాడీ కేంద్రాలు తెరిపించాం



8వ కేంద్రాన్ని తెరుస్తున్న సీడీపీవో శ్రీదేవి

నాతవరం: లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించి పౌష్టికాహారం అందిస్తున్నామని గొలుగొండ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరీ అన్నారు. శృంగవరం, నాతవరం తదితర గ్రామాల్లో ఎంపీడీవో హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సచివాలయ సిబ్బందితో అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో 168 కేంద్రాలకుగాను సోమవారం నాటికి 120 కేంద్రాలను తెరిపించి పౌష్టికాహారం అందించామన్నారు.

మాడుగుల ప్రాజెక్టు పరిధిలో 150 కేంద్రాలు
మాడుగుల రూరల్: కె.జె.పురం- 8వ కేంద్రాన్ని ఎంపీడీవో పి.ఎస్.ఎల్. మీనాకుమారి, తహసీల్దారు పి.వి.రత్నం, మాడుగుల ఐసీడీఎస్ పీవో సిహెచ్. శ్రీదేవి సమక్షంలో తెరిపించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు టి.హెచ్.ఆర్ అందజేసినట్లు సీడీపీవో శ్రీదేవి తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో 158 కేంద్రాలకు గాను ఇంత వరకు 150 కేంద్రాలు తెరిపించామన్నారు. తొలుత కేంద్రాన్ని కార్యకర్తలు లేకుండా తెరవద్దని ఎంపీటీసీ భీశెట్టి శ్రీనివాసరావు, చిన్నం లోవతల్లి అభ్యంతరం తెలిపారు. దీంతో కలెక్టర్ ఆదేశాల విధిగా పాటించాలని అధికారులు తెలిపారు.

రోలుగుంటలో వైజ్ఞానిక ప్రదర్శన



విద్యార్థులు పరిశీలించిన సైన్సు నమూనాలు

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన సోమవారం నిర్వహించారు. 64 మంది విద్యార్థులు 32 నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ సోమవారం ప్రారంభించారు. ఎంఈవోలు జగ్గారావు, జానుప్రసాద్, హెచ్‌ఎంలు వరప్రసాద్, దాడిశెట్టి రమేష్‌కుమార్, కేజీబీవీ ఎస్వో తులసి బృందం పరిశీలించి విజేతలను ఎంపిక చేసింది. బహుమతులు, ధ్రువపత్రాలను అందజేశారు.